నేటి గ్రీవెన్స్ సెల్ రద్దు

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈద్ మిలాదున్ నబీ పండుగ సందర్భంగా ఈనెల 16న ప్రభుత్వ సెలవు కావడంతో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

17న ప్రజాభవన్‌లో గ్రీవెన్స్ రద్దు

ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం నేపథ్యంలో ఈనెల 17న హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మాజ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో జరిగే రాష్ట్రస్థాయి గ్రీవెన్స్‌సెల్‌ను అధికారులు రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఈనెల 20న ప్రజాభవన్‌లో గ్రీవెన్స్‌సెల్ యథావిధిగా జరుగుతుందని, ప్రజావాణి నోడల్ అధికారులు తెలిపారన్నారు. జిల్లాలోని ప్రజలు గమనించాలని తెలిపారు.

సర్వం సిద్ధం

నేడు మానుకోటలో వినాయక నిమజ్జనం



నిజాం చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్



మహబూబాబాద్ నిజాం చెరువు వద్ద మూడు పడవలను కలిపి ఒకే పడవగా కడుతున్న సిబ్బంది



- నిజాం చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి
- అందుబాటులో నాలుగు క్రేన్‌లు తయార్
- శోభాయాత్ర రూట్‌మ్యాప్ తయారు చేసిన అధికారులు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, మునిసిపల్ చైర్మన్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 15 : వినాయక నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో సోమవారం గణనాథుడు గంగమ్మ చెంతకు చేరనున్నాడు. ఈనెల 7వ తేదీన వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండపాల్లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుల విగ్రహాల వద్ద భక్తులు తొమ్మిది రోజుల పాటు పూజలు చేశారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా నవరాత్రులు పూజలందుకున్న గణనాథులను నేడు చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు.

మానుకోట పట్టణంలోని నిజాం చెరువులో నిమజ్జనం చేయాలని మునిసిపల్ పాలకమండలి నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ ఏడాది లాగానే ఈ సారికూడా నిజాం చెరువులో నిమజ్జనం చేసేందుకు మునిసిపల్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా చిన్న, పెద్దకలిపి మొత్తం 1,560 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయగా, అందులో కొన్నింటిని ఐదోరోజు నిమజ్జనం చేశారు.

జిల్లా కేంద్రంలోని ఆయా మండపాల్లో 265 వినాయక విగ్రహాలు కొలువుదీరగా, ఐదో రోజు 12 విగ్రహాలను నిమజ్జనం చేయగా మిగిలిన 253 విగ్రహాలను సోమవారం రోజున నిమజ్జనం చేయనున్నారు. నిమజ్జన విధుల్లో అన్నిశాఖలకు సంబంధించిన ఉద్యోగులు 200 మంది నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ మానుకోట డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో నలుగురు సీఐలు, ఆరుగు ఎస్సైలు, 65 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

నిజాం చెరువు వద్ద..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న నిజాం చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మునిసిపల్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, కమిషనర్ రవీందర్, ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గతంలో ఒక మహబూబాబాద్ పట్టణ కేంద్రానికి సంబంధించిన విగ్రహాలను మాత్రమే నిజాం చెరువులో నిమజ్జనం చేసే వారు. అయితే ఇటీవల భారీ వర్షాలు కురవడంతో మునిసిపల్ విలీన గ్రామాలకు సంబంధించిన చెరువులు, కుంటకట్టలు దెబ్బతిని ప్రమాదకరంగా మారడంతో ఈదులపూసపల్లి, శనిగపురం, జమాండ్లపల్లి, అనంతారం, రజాలిపేట, బేతోలు గ్రామాల్లోని వినాయక విగ్రహాలను కూడా నిజాం చెరువులో నిమజ్జనం చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఆరుగురు గజ ఈతగాళ్లు..

మానుకోట పట్టణంలోని నిజాం చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జం చేసేందుకు నాలుగు క్రేన్‌లను సిద్ధం చేశారు. ఇందులో రెండుక్రేన్‌లతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. మిగతా రెండుక్రేన్‌లను చెరువు వద్ద అదనంగా ఉంచనున్నారు. మరోపక్క మూడుపడవలను కలిపి ఒకపెద్ద పడవగా తయారు చేశారు. అందలో పెద్ద విగ్రహాలను పెట్టి చెరువులలోనికి తీసుకువెళ్లి నిమజ్జనం చేస్తారు. ఆయా క్రేన్‌ల నిర్వాహణకు మునిసిపల్ డీఈ ఉపేందర్, టౌన్ ప్లానింగ్ అధికారి సాయిరాంను ఇన్‌చార్జీలుగా నియమించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పిల్లలు, పెద్దలు నిజాం చెరువు ప్రాంతానికి దూరంగా ఉండేలా అక్కడ బారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఎంట్రీ గేట్ నుంచి ఒక్కో విగ్రహంతో ఇద్దరు నిర్వాహకులను మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. లోనికి వెళ్లాక మునిసిపల్ సిబ్బంది మాత్రమే అటు క్రేన్, ఇటు పడవ సాయంతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. కాగా, నిజాం చెరువువద్ద ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆరుగురు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. కాగా, ప్రతీ వినాయక విగ్రహానికి మునిసిపల్ పాలక మండలి స్వాగతం పలికి నారికేళం సమర్పించి పూజల అనంతరం నిజాం చెరువుకు సాగనంపేందుకు ఫారెస్టు సెంటర్‌లో ఆహ్వాన వేదికను ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్, శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారని, షెడ్యూల్ ప్రకారం.. గణేష్ నిమజ్జనం పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు నరేష్, వీరన్న, డీఎస్పీ తిరుపతిరావు, మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, విద్యుత్ డీఈ విజయ్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ ఫారెస్టు సెంటర్ మునిసిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఆహ్వాన వేదిక



మహబూబాబాద్ నిజాం చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, అధికారులు

నిమజ్జనం రూట్ మ్యాప్..

మహబూబాబాద్ పట్టణంలోని నిజాం చెరువులో నిమజ్జనం చేసేందుకు వెళ్లే వాహనాల కోసం మునిసిపల్, పోలీస్ అధికారులు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. శనిగపురం రోడ్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, మూడుకొట్ల సెంటర్ మీదుగా కొత్త బజారులోని విగ్రహాలు తహసీల్ ఆఫీసు, నెహ్రూసెంటర్, ఆర్యూబీ, ఆర్వోబీ మీదుగా ఇల్లందు బైపాస్‌లోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద దిగి అక్కడ నుంచి వ్యవసాయ మార్కెట్, మునిసిపల్ ఆఫీసు, రైల్వేస్టేషన్ సెంటర్, ఫారెస్టు సెంటర్ వద్దకు చేరుకుంటాయి. ఆహ్వాన వేదిక వద్ద పూజలనంతరం బయలు దేరి బస్టాండ్ సెంటర్ మీదుగా నిజాం చెరువుకు చేరుకుంటాయి. నిమజ్జనం అనంతరం తిరిగి స్నేహనగర్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాం డ్ సెంటర్, నర్సంపేట బైపాస్ నుంచి ఇల్లందు రోడ్ మీదుగా కొత్త బజారుకు వెళ్లేలా రూట్ మ్యాప్‌ను తయారు చేశారు.

పోలీసుల సూచనలివే..

- గణేష్ నిమజ్జన శోభాయాత్రలో డీజే సౌండ్ బాక్స్‌లను ఉపయోగించవద్దు.
- శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలి.
- ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలను గమనించుకుంటూ వాహనాలను ముందుకు సాగాలి.
- మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలను, పాటలను ప్రదర్శించరాదు.
- శోభాయాత్రలో బాణసంచాలు కాల్చడం చట్ట ప్రకారం నిషేధం. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు.
- నిమజ్జన సమయంలో చెరువులు, కుంటల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలి. నీటి వద్దకు పిల్లలను రానీయకుండా జాగ్రత్తలు పాటించాలి.
- విగ్రహాలను తీసుకువెళ్లే సమయంలో మద్యం మత్తులో ఉన్న వారిని అనుమతించవద్దు.
- వీలైనంత త్వరగా బయలు దేరాలి. వాహనాలపై పరిమితికి మించి భక్తులు వెళ్లకూడదు.
- వినాయక నిమజ్జనం రూట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇవి పూర్తిగా పోలీస్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయడం జరిగింది.

భూమి కొనుగోలు విషయంలో గొడవ

- ఠాణా ఎదుట పురుగుల మందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం
- చిన్నగూడూరులో ఘటన



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగరబోయిన వెంకన్న-హైమా దంపతులు



చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల ఆధీనంలో ఉన్న బాధితుల కుమారుడు పవన్

చిన్నగూడూరు, సెప్టెంబరు 15 : భూమి కొనుగోలు విషయంలో దంపతులు ఆత్మహత్యాయత్నంచేశారు. ఈ ఘటనచిన్నగూడూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం చోటు చేసుకొంది. బాధితులు గంగరబోయిన వెంకన్న-హైమా దంపతులు తెలిపిన వివరాల ప్రకారం.

ఉగ్గంపల్లికి చెందిన గంగరబోయిన వెంకన్న-హైమా దంపతులకు ఎకరం పొలం ఉంది. దాన్ని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వరుసకు అన్న అయిన గంగరబోయిన వీరన్న వద్ద మూడునెలల క్రితం రూ.17.60 లక్షలకు ఎకరం భూమిని వెంకన్న కొనుగోలు చేశాడు. మొదటి విడతగా రూ.3.70 లక్షలు కట్టగా, మరోరెండు వాయిదాల్లో మొత్తం నగదు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా, భూమి అమ్మిన వ్యక్తి వీరన్న తాను అప్పుల పాలయ్యాయని, నెలలో తనకు డబ్బులు మొత్తం కావాలని పెద్దమనుషుల సమక్షంలో అడుగగా తాను ఇప్పుడు చెల్లించలేనని, చేసుకున్న ఒప్పందం ప్రకారం.. రెండు వాయిదాల్లో చెల్లిస్తానని వెంకన్న తెలిపారు. ఇందుకు పెద్దమనుషులు వీరన్న అప్పుల పాలయ్యాడని, అతను అడిగినట్లుగా ఒక్క నెలలోనే చెల్లించాలని ఒత్తిడి చేయగా ఆదివారం చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇందుకు పోలీసులు కూడా పెద్దమనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాలని ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురైన వెంకన్న-హైమా దంపతులు పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన పోలీసులు వారిని పోలీస్ వాహనంలో హుటాహుటిన చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వెంకన్న-హైమా దంపతులకు డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు.

కాగా, తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్య చేసుకోబోతున్న దృశ్యాలను ఫోన్‌లో వెంకన్న-హైమా దంపతుల కుమారుడు చిత్రీకరిస్తుండగా పోలీసులు ఫోన్ లాక్కొనిస్టేషన్‌లో కూర్చోబెట్టి చేయి చేసుకున్నట్లు వారు ఆరోపించారు. విషయంపై ఎస్సై ఘూన్సీని వివరణ కోరగా బాధితులపై తాము ఏమి ఒత్తిడి చేయలేదని, బాధితుల కుమారుడిపై కూడా చేయి చేసుకోలేదని, అతడిని స్టేషన్‌లో కూర్చోబెట్టలేదని వివరణ ఇచ్చారు.

'సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే'




మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు జి.నాగయ్య

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 15 : భూమికోసం.. భుక్తికోసం... వెట్టి చాకిరి విముక్తి కోసం, సామాజిక అణిచివేత మీద సమైక్య పోరాటమే వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని ఆ పోరాటనికి కమ్యూనిస్టులే వారసులని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ అధ్యక్షతన వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో దోపిడీకి వ్యతిరేకంగా వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటస్ఫూర్తితో భూపోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, రావుల రాజు, హేమానాయక్, కుమ్మరికుంట్ల నాగన్న, నక్క సైదులు, కందూనూరి శ్రీనివాస్, ఎర్ర శ్రీను, బానోత్ వెంకన్న, తోట శ్రీను పాల్గొన్నారు.

రికార్డుస్థాయిలో ఆదిదేవ లడ్డు వేలం

- రూ.4,51,116లకు దక్కించుకున్న రైల్వే ఉద్యోగిని





కేసముద్రం ఆదిదేవ లడ్డును దక్కించుకున్న కల్లెపల్లి శిరీషను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

కేసముద్రం, సెప్టెంబర్ 15 : కేసముద్రం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన లడ్డువేలం రికార్డు స్థాయిలో పలికింది. గత ఏడాది రూ.2,21,116లకు ఈ లడ్డు వేలం జరగగా ఈసారి అంతకు రెట్టింపు స్థాయిలో రూ.4,51,116లకు కేసముద్రం స్టేషన్‌కు చెందినదివంగత కల్లెపల్లి యాకయ్య భార్య రైల్వే ఉద్యోగిని శిరీష దక్కించుకోవడం విశేషం. గత ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఈ లడ్డు పలుకుతుండడంతో ఈసారి ఉత్కంఠతగా వేలం సాగింది. గత రికార్డులను తుడిచి వేస్తూ రికార్డు ధరవేలంలో లడ్డు దక్కించుకోవడం గమనార్హం. ఈ లడ్డు 11 కిలోలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ బాధ్యులు శిరీషను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులను కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఉపాధ్యాయుడికి అవార్డును ప్రదానం చేస్తున్న యశస్వినిరెడ్డి

తొర్రూరు, సెప్టెంబరు 15 : ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తూ.. విద్యార్థులను కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దాలని నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. ఆదివారం తొర్రూరులోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో తెలంగాణ ప్రైవేటు స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానోత్సవానికి ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి ప్రోగ్రామ్ చైర్మన్‌గా వ్యవహరించగా, జిల్లా అధ్యక్షుడు ముత్తినేని జయప్రకాశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పేద బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రైవేటు పాఠశాలలు కృషి చేస్తున్నాయన్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3లక్షల మంది బోధన, బోధనేతర సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. రాష్ట్ర రాజధానిలో ట్రస్మాకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని, శిక్షణకు ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలను శాలువా మెమెంటోలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకుడు రమేష్ రావు, ఎంఈవో రాము, రాఘవేందర్‌రెడ్డి, ముత్తినేని జయప్రకాశ్, అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, భూపాల్‌రావు, గోపాల్‌రెడ్డి, శంబారెడ్డి, నరేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కలీద్ పాష, అప్పారావు, నరేష్ పాల్గొన్నారు.

దైవత్వంతోనే మానసిక ప్రశాంతం..

●తొర్రూరు రూరల్ : దైవత్వంతోనే మానసిక ప్రశాంతతా ఉంటుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమారంలో అభయాంజనే య స్వామి ఆలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరంఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, డాక్టర్ కందుకూరి రాజేందర్‌రెడ్డి, చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్‌అధ్యక్షుడు హమ్యానాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సమన్వయ కమిటీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ తమ్మడపల్లి సంపత్, గ్రామశాఖ అధ్యక్షుడు కక్కెర్ల సహదేవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వైరల్ ఫివర్



నేటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటా : రాంచందర్

కురవి, సెప్టెంబరు 15 : ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ గత మూడ్రోజులుగా వైరల్ ఫివర్‌తో బాధపడుతున్నారు. నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలతో నియోజకవర్గంలోని వర్షప్రభావ ప్రాంతాల్లో పర్యటించి అస్వస్థతకు గురయ్యారు. మూడ్రోజులుగా జ్వరంతో బాధపడుతూ.. తన సొంత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే సోషల్ మీడియాలో రాంచందర్‌నాయక్ జ్వరంతో బాధపడుతున్నారని, పరిస్థితి విషమంగాఉందని వార్తలు రావడంతో రాంచందర్‌నాయక్ స్పందించి జ్వరం వచ్చిన మాట వాస్తవమేనని, ప్రస్తుతం కోలుకుంటున్నారు. సోమవారం నుంచి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతులకు సర్కారు అండ

తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

బాలసముద్రం, సెప్టెంబరు 15: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ పంటలు సాగు చేస్తున్న రైతులకు రాష్ట్రప్రభుత్వం అండగా పని చేస్తోందని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రితుమ్మల నాగేశ్వర్ రావు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచాలని కోరినట్లు తెలిపారు. సెప్టెంబరు 13న కేంద్ర ప్రభుత్వం ముడిపామ్ ఆయిల్ దిగుమతిపై సుంకాన్ని పెంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు జంగా రాఘవరెడ్డి పేర్కొన్నారు. రైతులు వరికి బదులు పామాయిల్ సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని జంగా రాఘవరెడ్డి ప్రకటనలో కోరారు.

పడమటిగూడెంలో మండపం గద్దె రాజకీయం!?



పడమటిగూడెం యూపీఎస్ పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట జరుగుతున్న మండపం గద్దె పనులు

నర్సింహులపేట, స్టెంబరు 15 : మండలంలోని పడమటిగూడెంలో మండపం గద్దె రాజకీయం పాతగూడెం.. కొత్తగూడెం ఇరు పార్టీల నాయకుల మధ్య కొద్దిరోజులుగా కొనసాగుతున్నది. ఓ వర్గానికి చెందిన (కొత్తగూడెం) నాయకులు గ్రామంలోని ప్రభుత్వ ప్రథమికోన్నత పాఠశాల గేటు ప్రధాన ద్వారం ఎదుట నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం నిబంధనలు అతిక్రమించి, శాస్వత మండపం గద్దె నిర్మాణపు పనులు చేపట్టారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందంతో పాటు (పాతగూడెం) నాయకులు ప్రతిఘటించి, ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ నిర్మాణం చేపడుతున్నారని మండల ప్రత్యేక అధికారితో పాటు పంచాయతీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ మండల అధికారులు స్పందించి మండపం గద్దె పనులు నిలిపివేయాలని ఈ నెల 9న నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 12న మండలం గద్దె పనులు నిలిపివేయాలని కార్యదర్శి శ్రీకాంత్ నోటీసు పత్రం నిర్మాణం దశలో ఉన్న పిల్లర్‌కు అంటించారు. అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తూ నోటీసులు యథాతదంగా కొనసాగిస్తుండడంతో పాతగూడెం.. కొత్తగూడెం ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. పంచాయతీ, విద్యాశాఖ జిల్లా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న మండపం గద్దెపనులు నిలిపివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- కిన్నెర యాకయ్య, ఎంపీవో, నర్సింహులపేట



మండలంలోని పడమటిగూడెంలో ఎలాంటి అనుమతి లేకుండా పాఠశాల గేటు దగ్గర మండపం గద్దె ఏర్పాటు చేస్తున్నట్లు ఫిర్యాదు వచ్చింది. పనులు నివిపివేయాలని నోటీసులు జారీ చేశాము. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

18న పెద్దల పండుగ జరుపుకోవాలి

కొత్తగూడ, సెప్టెంబరు 15 : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ప్రతీ సంవత్సరం జరుపుకునే పెద్దల పండుగను ఈనెల 18న కొత్తగూడ, గంగారం మండలాల్లోని ఆదివాసీలు నిర్వహించుకోవాలని దొరపటేళ్ల సంఘం ఉమ్మడి కొత్తగూడ మండల అధ్యక్షుడు బీరబోయిన సమ్మయ్య పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా ఆదివాసీలు జరుపుకుంటున్న పెద్దల పండుగను ప్రతీ సంవత్సరం ఉత్తర కార్తీలోని మొదటి పాదంలో వచ్చే మొదటి బుధవారం నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా ఆదివాసీలు సంప్రదాయకరంగా పెద్దల పండుగను జరుపుకోవాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎట్టి సర్వయ్య, కోశాధికారి కల్తి వెంకటేశ్వర్లు, మల్లెల రాంబాబు, ఈక నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

మెడికల్ కళాశాలను అభివృద్ధి చేయాలి

- నర్సంపేట సివిల్ ఆస్పత్రిని నెక్కొండకు తరలించాలి
- సీఎంకు మాజీ ఎమ్మెల్యే పెద్ది లేఖ

నర్సంపేట, సెప్టెంబరు 15 : నర్సంపేట పట్టణ శివారులోని మెడికల్ కళాశాలను మరింత అభివృద్ధి చేయాలని, నర్సంపేట నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించాలని బీఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ పంపారు. జిల్లా స్థాయి ఆస్పత్రి ఏర్పాటు అవుతున్నందున నర్సంపేటలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని గిరిజన ప్రాంతమైన నెక్కొండకు తరలిస్తే మండలంలోని ప్రజలు, గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. దుగ్గొండిలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే నర్సంపేటలో మెడికల్ కళాశాల కోసం విరాళంగా భూమిని అందించిన పారిశ్రామికవేత్త దొడ్డ మోహన్‌రావును కళాశాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు.

ఇప్పటికే రూ.100 కోట్లతో అన్ని వసతులతో ఆస్పత్రి భవన నిర్మాణం, 50 అడ్మిషన్లతో అన్ని వసతులతో కళాశాల భవన నిర్మాణం పూర్తయిందన్నారు. మెడికల్ కళాశాలలో భవిషత్‌లో 150 అడ్మిషన్లను పెంచుకునే అవకాశం ఉందన్నారు. పీజీ కళాశాల మంజూరు కావాల్సి ఉందని, నర్సింగ్ కళాశాల మంజూర యిందన్నారు. నర్సింగ్ కళాశాలకు శాశ్వత భవనం, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సహాయ సిబ్బందికి సంబంధించి రెసిడెన్సియల్ భవనాలు, రెసిడెన్సియల్ హాస్టల్ ల్యాబ్స్ ఇతర వసతు కొరకు జీవో 83 ద్వారా మరో రూ.183 కోట్లు మంజూరై ఉన్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న పనులు కాకుండా కొత్తపనులకు టెండర్లు పిలవాల్సిన అవసరం ఉందని సీఎంకు పంపిన లేఖలో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

నియోజకవర్గంలో 53 పల్లె దవాఖానాలు బీఆర్ఎస్ హయాంలో మంజూరయ్యాయని, అందులో 29 దవాఖానాలు పూర్తయ్యాయని, మిగిలినవి పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సీఎంను కోరారు. జాతీయ స్థాయి విద్యా సంస్థ అయిన మెడికల్ కళాశాల భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రావటం గౌరవప్రదంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పంపిన లేఖ ప్రతులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహ, రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పంపానని ఆయన పేర్కొన్నారు.

కారు డ్రైవర్ ఇంట్లో చోరీ

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని కారు డ్రైవర్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.10వేల నగదు, రూ.90వేల విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన వెల్మా రాజేందర్ కారుడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 12న రాజేందర్ అతడి భార్య సుజాత, కూతురు హిరకలు వేములవాడ దేవస్థానానికి మొక్కులు తీర్చుకునేందుకు వెళ్లారు. రాజేందర్ కుటుంబసభ్యులు తిరిగి ఈ నెల 14న రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తొలగించి ఉన్నట్లు గుర్తించి ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా అందులో దాచి పెట్టిన తులం బంగారు గొలుసు, 5 గ్రాముల బంగారు కమలు, మాటీలు, 5 బంగారు ముక్కలు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుడు రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం కానిస్టేబుల్ క్రాంతికుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ చేరాలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

వేసవి సెలవుల్లో పదోన్నతులు ఇప్పిస్తాం..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులకు వేసవిసెలవుల్లో పదోన్నతులు ఇప్పిస్తామని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వాన్ని ఒప్పించి ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిసామనే ధీమాను వ్యక్తం చేశారు. జీవోనెం. 11, 12లను సవరించి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పిస్తామన్నారు. బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంల ప్రమోషన్లు ఇప్పిస్తామన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ టైం స్కేలు ఇప్పిస్తామని హామి ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్టీయూ ముందుంటుందన్నారు. అన్ని యాజమాన్య గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను త్వరలోనే పరిష్కరింప జేస్తామన్నారు. అనంతరం హనుమకొండ జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందల తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా పలీత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షులుగా డి.కోమల్‌రెడ్డి, కె.దయాకర్‌రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా వి.వాణి, ఉపాధ్యక్షులుగా ఎ.మహిపాల్‌రెడ్డి, వి.రామాంజనేయులు, కె.రాజేందర్‌రెడ్డి, జి.విష్ణుమూర్తి, ఎం.సురేందర్, మహిళా ఉపాధ్యక్షులుగా పి.సరస్వతి, కార్యదర్శులుగా బి.మురళీధర్, బి.శరత్‌గౌడ్, ఎల్.గణపతినాయక్, కె.రమేష్‌బాబు, మహిళా కార్యదర్శిగా నికత్ సుల్తానాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు సాధించిన గౌరిశెట్టి రాజన్న, జిల్లా స్థాయిలో సత్కారం పొందిన అనురాధను సత్కరించారు. సంఘ నాయకులు శ్రీనివాస్, ఉమామహేశ్వర్, పట్టాభి, సుమ, అనురాధ, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



విజయ్ (ఫైల్)

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 15 : కేసముద్రం మండలం ఇంటికన్నెకు చెందిన రైల్వే ట్రాక్‌మెంటెనర్ కాడబోయిన విజయ్ (35) గుండెజబ్బుతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఈనెల 12న ఇంటి వద్ద క్రిమిసంహారకమందు తాగగా కుటుంబసభ్యులు ఆయన్ను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య మణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. విజయ్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరి వేసుకుని యువకుడు..

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా) : ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. మన్నెగూడెంకు చెందిన పాతలోతు వినేష్ (23)కు ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బర్లగూడెంకు చెందిన కరుణశ్రీతో ఐదునెలల క్రితం వివాహం జరిగింది. వినేష్ తండ్రి బాలు మన్నెగూడెంలో ఓ చర్చి పాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న దంపతులిద్దరూ బర్లగూడెంలోని కరుణశ్రీ తల్లిగారింటికి వెళ్లారు. అక్కడ్నుంచి వినేష్ ఒక్కడు మాత్రమే మన్నెగూడెంలోని ఇంటికి వచ్చాడు. వినేష్ తండ్రి బాలు అనారోగ్యంతో ఉండడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చర్చిని శుభ్రం చేసేందుకు పనిమనిషి వచ్చారు. ఆమె తలుపులు కొట్టగా ఎవరూ తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె కిటికిలో నుంచి చూడగా వినేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడు. వెంటనే ఈ విషయాన్ని వినేష్ తండ్రికి సమాచారం అందించారు. వినేష్ తండ్రి బాలు మన్నెగూడెంకు చెరుకుని విఘతజీవిగా ఉన్న కొడుకును చూపి కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, తన కొడుకు మృతిపై తనకు అనుమానం ఉందని వినేష్ తండ్రి బాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెగడపల్లికి చెందిన దామెర ఎల్లయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్రావణ్‌కుమార్ (23) ఈ నెల 14న ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లి తిరిగి రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. 15న ఉదయం వంగపహాడ్-ఆరెపల్లి ఔటర్‌రింగ్‌రోడ్ మధ్యలో రోడ్డుప్రమాదంలో చనిపోయినట్లు ఫోన్ సమాచారం రావడంతో వెళ్లి చూసేసరికి ద్విచక్రవాహనం రోడ్డు ప్రక్కనే విద్యుత్ స్తంభానికి ఢీకొని శ్రావణ్‌కుమార్ చనిపోయినట్లు గుర్తించారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు.

గంజాయి పట్టివేత

కాజీపేట, సెప్టెంబరు 15: పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓవ్యక్తి వద్ద గంజాయి లభ్యమైంది. కాజీపేట ఎస్సై వి.లవన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే ఆస్పత్రి వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతడి వద్ద 860 గ్రాముల గంజాయి లభ్యమైంది. కాజీపేటకు చెందిన గొర్రె సారంగపాణి ఇరవై రోజుల క్రితం విశాఖపట్నం వెళ్లి వ్యాపారం చేసేందుకు గంజాయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 21,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

చెరువుల రక్షణకు వాడ్రాను ఏర్పాటు చేయాలి

వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్

సుబేదారి, సెప్టెంబరు 15: వరంగల్ ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటల పరిరక్షణ కోసం వాడ్రాను ఏర్పాటు చేసి, వాటిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్య క్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హను మకొండ అదాలత్ జంక్షన్‌లోని అమర వీరులస్థూపం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రజాసంఘాల నేతలు డాక్టర్ తిరునహరి శేషు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, సాయిని నరేందర్, డాక్టర్ చింతం ప్రవీణ్ లు మాట్లాడారు. భద్రకాళి, వడ్డెపల్లి చెరువులలో కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని అన్నారు. వరంగల్ జిల్లాను కబ్జాదారుల నుంచి కాపాడాలని, కబ్జాలకు సహకరించిన అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోంఢ్ర నర్సింగరావు, డాక్టర్ వెంగళరెడ్డి, తాడిశెట్టి క్రాంతి కుమార్, గాజుల గోవర్ధన్, మల్యాల కృష్ణ, చుంచు రాజేందర్, సింగారపు రవిప్రసాద్, ఊ నర్సయ్య, సాదు కుమారస్వామి, కృష్ణస్వామి, పరశురాములు, వస్కుల రవీందర్, ఎబినైజర్, అంకేశ్వరపు రాంచదర్, కన్నాల రవి పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మడికొండ, సెప్టెంబరు 15: ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బోగి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మడికొండలో నిర్వహించిన వాల్మీకి బోయ బోగి లింగమూర్తి అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి బోయల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వల్మీకి బోయ వరంగల్ ఉమ్మడి జిల్లా జేఏసీ ప్రతినిధులు నిగ్గుల వెంకటప్రసాద్, ముచ్చు రాజ్‌కుమార్, దేశెట్టి గోపాల్, వెంకటేష్, బోగి కుమారస్వామి, పెనుకుల సారయ్య, తట్ల రమేష్, బేర్గు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోగి కృష్ణమూర్తి

రావయ్యా.. గణపయ్యా..

- నిమజ్జన వేళ గణపతులకు అపూర్వ స్వాగతం
- నగరంలో మూడు చోట్ల ప్రత్యేక వేదికలు
- విశ్వహిందూ పరిషత్ నేతల వెల్లడి
- ఉత్తమ గణపతులకు బహుమతులు





అత్యుత్తమ బహుమతిని అందుకుంటున్న కాజీపేటలోని టీఎన్జీవోస్ గజానన మండలి నిర్వాహకులు, ద్వితీయ బహుమతి అందుకుంటున్న శ్రీజ హోమ్ బాధ్యులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 15: నిమజ్జనానికి తరలివచ్చే గణేష్ విగ్రహాలను అపూర్వంగా స్వాగతించేందుకు ఎప్పటిలాగే మూడు ప్రాంతాల్లో ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ వరంగల్ మహానగర గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ న్యాలకొండ భాస్కర్‌రావు, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. యేటా నిర్వహించే ఉత్తమ గణపతులకు బహుమతుల ప్రదానోత్సవం హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం జరిగింది.

శ్రీ చైతన్యానంద మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ గణేష్ మండళ్ల నిర్వాహకులకు జ్ఞాపికలు అంద జేసి దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా న్యాలకొండ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. కాజీపేట నుంచి తరలివచ్చే వినాయక విగ్రహాలను నిట్ సమీపంలో.. హనుమకొండ ప్రాంతం నుంచి తరలివచ్చే గణేష్ నిమజ్జన రథాలను హనుమకొండ చౌరస్తాలో.. వరంగల్ ప్రాంత విగ్రహాలకు పోచమ్మమైదాన్ సెంటర్‌లో ప్రత్యేక వేదికలను ఏర్పాట్లు చేసి ఆయా గణేష్ మండళ్ల తొమ్మిదిరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలను వివరిస్తూ అపూర్వంగా స్వాగతించనున్నట్లు వివరించారు.

ఈసారి ఉత్సవాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో మట్టి గణపతులను మండపాలలో నెలకొల్పి పూజలు నిర్వహించి పర్యావరణానికి సహక రించారని తెలిపారు. ఉత్తమ గణేష్‌ల ఎంపిక కోసం ఏడు విభాగాలుగా ఎంపికచేసిన 150 మంది కార్యకర్తలు తమకు సహకరించినట్లు భాస్క ర్‌రావు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

ఉత్తమ గణపతి మండళ్లు ఇవే..

వరంగల్ మహానగర పరిధిలోని అన్ని విగ్రహాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఉత్తమ గణపతులను ఎంపిక నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈసారి మహానగర పరిధిలో కాజీపేట బాపూజీనగర్ ప్రాంతంలో టీఎన్జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ గజానన మండలి మండలిని అత్యుత్తమ గణపతి మండలిగా ఎంపిక చేశారు. అదే విధంగా హమారా హిం దుస్థాన్ పేరిట కాజీపేట బాపూజీనగర్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణప య్యకు ద్వితీయ బహుమతి ప్రదానం చేశారు. వీటితోపాటు వరంగల్ ఎల్లం బజార్‌లోని భద్రకాళి హిందూ ఉత్సవ సమితి, కాశిబుగ్గ ఓసిటీ గజా ణన మండలి, ఖిలావరంగల్ వినాయక ట్రస్టు భవన్ వాసవీ లైన్, హనుమకొండలోని నందిహిల్స్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండలి, అలాగే హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీగ జాణన మండలి, కేయూ పరిధిలో విజయగణపతి కాలనీలో విజయగణపతి మందిరంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి అత్యుత్తమ మండలులుగా ఏర్పాటు చేసి బహుమతులను ప్రదానం చేశారు. కాగా, ప్రథమ బహుమతులుగా వరంగల్ గీతాభవన్‌లోని సిద్ధి విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ, కాశిబుగ్గలోని రాంకీ విల్లాలో ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ, ఖిలా వరంగల్‌లోని బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండలి, హనుమకొండ జులైవాడలో శివపార్వతి గజానన మండలి, జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్‌లో విజయగణపతి నవరాత్రి సమితి, కాజీపేట డీజిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి యూత్ అసోసి యేషన్ ద్వితీయ బహుమతులుగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని 14 గణేష్ మండళ్లకు అందించగా, తృతీయ బహుమతులుగా 22 గణేష్ మండళ్లను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మంత్రి సురేఖ



టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, సెప్టెంబరు 15: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో పదవీబాధ్యతలు స్వీకరించారు. కాగా, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మహేష్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మహమ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకం

పవిత్ర హృదయంతో కూడిన ప్రతీ మనిషికి యావత్తు భూమి ప్రార్థనా స్థలమేనని మహమ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకమని మంత్రి కొండా సురేఖ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ (సోమవారం)ను పురస్కరించుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచించిన శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, ధార్మిక చింతన, దాతృత్వం, సర్వమానవ సమానం అనే సుగుణాలు మనిషిని ఉత్తమ మార్గంలో నడిపిస్తాయని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చుపెడితే ఊరుకునేది లేదు..



సమావేశంలో మాట్లాడుతున్న మన్నె చంద్రయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15: ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చుపెడితే ఊరుకునేది లేదని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య హెచ్చరించారు. ఆదివారం కాళోజీ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా సంఘాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సంఘం ఎన్నికల్లో ఓడిన ఓ వ్యక్తి సంఘంలో చీలికలు తెచ్చి సంఘం నాది అనే ధోరణతో వ్యవహరించడం సరికాదన్నారు. సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఇటీవలకాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులను మభ్యపెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ తమకు అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయని ప్రగల్భాలు పలుకుతున్న వారు వారి పద్ధతిని మార్చుకోవాలన్నారు. పోలీసుల కేసులు పెడతామని బెదిరింపులకు గురిచేస్తే ఎవరు భయపడరన్నారు. సంఘం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మాత్రమే పదేళ్లుగా పాటుపడుతున్నామని, రాజకీయాలు చేసేందుకు ఉపాధ్యాయ సంఘంలో పనిచేయడంలేదన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చెన్నయ్య, అబ్దుల్ పనిచేస్తున్నారని, ఆ సంఘంలోనే తాము పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస్, రమేష్, సంతోష్, రాజు, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ కామన్ మెస్‌లో అగ్ని ప్రమాదం



ప్రమాదంలో దగ్ధమైన వంటపాత్రలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15: కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్‌లో ఆదివారం ఉదయం వంటలు చేస్తుండగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలతో ఒక్కసారిగా కామన్ మెస్ సిబ్బంది, విద్యార్థులు ఆందోళనలకు గురయ్యారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో కామన్ మెస్ సిబ్బంది వంట చేస్తుండగా నూనె భారీ గిన్నెలో సలసల కాగడంతో వేడికి ఒక్కసారిగా మంటలు లేచాయి. మంటల్లో కామన్ మెస్‌కు సరఫరా అయ్యే విద్యుత్ వైర్ కాలి బూడిదైయింది. వంట పాత్రలు కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని విద్యార్థులు, సిబ్బంది చెప్పారు. ఒకవేళ విద్యుత్ వైర్లు నీళ్లలో పడిఉంటే కామన్ మెస్ భవనానికి షార్ట్ సర్క్యూట్ జరిగి భారీ ప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డికి ప్రమాద విషయాన్ని వివరించి విద్యుత్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. వర్సిటీ విద్యుత్ సిబ్బంది కామన్‌మెస్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో విద్యార్థులకు మధ్యాహ్నం లంచ్‌కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు చేపట్టారు. వర్సిటీ ఇంజనీరింగ్ శివశంకర్, హాస్టల్స్ కేర్ టేకర్ ప్రభాకర్, రాజు తదితరులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. భారీ ప్రమాదం తప్పటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వర్సిటీ కాంట్రాక్టు

అధ్యాపకులు బెదిరిస్తున్నారు..

సోషల్ మీడియాలో ఓ దళిత మహిళ ప్రొఫెసర్ ఆవేదన

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15: కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు తన విధులకు ఆటంకం కలిగిస్తూ, అవమాన పరుస్తున్నారని కేయూ ఆర్ట్స్ డీన్, తెలుగు విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళా ప్రొఫెసర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సదరు మహిళ ప్రొఫెసర్.. ఆదివారం సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తపరిచారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి.. వర్సిటీ క్యాంపస్‌లోని తెలుగు విభాగానికి బదిలీ చేయాలంటూ ఐదు నెలలుగా తనను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేసింది. మరో ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి ఆయన.. తన చాంబర్ తలుపులను కోపంతో తోసుకుంటూ వచ్చి తీవ్ర పదజాలంతో మాట్లాడి తన విధులకు ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేసింది. కాంట్రాక్టు అధ్యాపకుడైన తనను కాదని, మరో పార్టుటైమ్ అధ్యాపకురాలిని డిపార్టుమెంట్‌కు ఎలా బదిలీపై రప్పిస్తావని ప్రశ్నించారని తెలిపింది. మీకు తెలుగు విభాగాధిపతిగా పనిచేయడం చేతకాదని, రాజీనామా చేయలంటూ మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలు, వర్సిటీ నిబంధనల మేరకు తాను విధులు నిర్వహిస్తున్నానని చెప్పినప్పటికీ వర్సిటీలో కాంట్రాక్టు సంఘం అధ్యక్షుడు, ఇతర కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి తనను ఇబ్బందులకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

నీటి పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక

వడ్డెపల్లి, సెప్టెంబరు 15: మిషన్ భగీరథ నీటి నాణ్యత, పరిశీలన, పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ముఖ్య సలహాదారు కె.ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా అచ్చ రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పులి రాజేష్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, కె.విద్యావతి, జిల్లా కోశాధికారులుగా జి.సూరజ్, ఎస్.భాగ్య లక్ష్మి, జాయింట్ సెక్రటరీగా యు.కిరణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అశోక్, రాధిక, భరత్, యాకయ్య, రాజు, పరశురాములు ఎన్నికయ్యారు.

రేపు ఏనుమాముల మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు

మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సోమవారం వినాయక నిమజ్జనం, మంగళవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెల వుగా ప్రకటించడం జరిగింది. కాగా ప్రభుత్వం సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మార్కెట్ మం గళవారం యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు తమ సరుకులను విక్రయించడానికి అవకాశం ఉందని ఆ ప్రకటనలో తెలిపారు.

పశుగణనకు సిద్ధం

- భారత్ పశుగణ యాప్ అందుబాటులోకి రాగానే మొదలు
- సిబ్బందికి శిక్షణ పూర్తి



హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :ఐదేళ్లకోసారి జరిగే జాతీయ పశుగణన చేపట్టేం దుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పశు సంవర్ధక శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. వాస్తవంగా ఈ గణన ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభం కావలసి ఉంది. అయితే పశు గణ్ పేరుతో కేంద్రం ఒక యాప్‌ను రూపొందిస్తోంది. ఈ పని ఇంకా పూర్తి కాలేదు. యాప్ అందుబాటులోకి రాగానే పశుగణన మొదలవుతుంది. నాలుగు నెలల పాటు ఈ గణన సాగుతుంది. పశుగణన ఐదేళ్లకోసారి దేశ వ్యాప్తంగా జరుగుతుంది. ఈ గణనలో భాగంగా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కుందేళ్లు, కోళ్ల తదితర లైవ్‌స్టాక్‌ను లెక్కిస్తారు. 2018లో 20వ పశుగణన నిర్వహించారు. 2023లో 21వ గణన జరపాల్సి ఉండగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరగడంతో ఆలస్యమైంది.

ఈ గణన ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా అవులు, గేదెలు,, గొర్రెలు, మేకలు పొందిన వారి వివరాలతోపాటు కోళ్ల ఫారాలు ఎన్ని ఉన్నాయనే ది కూడా తెలుస్తుంది. మొత్తం మీద గతంతో పోల్చితే పశువుల సంఖ్య ఏ మేర పెరిగింది అనేది స్పష్టమవుతుంది. 2018లో నిర్వహించిన పశు గణన ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 47.04 లక్షల లైవ్ స్టాక్, 61.30 లక్షల కోళ్లు ఉన్నాయి. ఈ సారి ఇవి ఏ మేరకు పెరిగింది? లేదా తగ్గింది.. తాజా పశుగణన ద్వారా తేటతెల్లమవుతుంది. ఉమ్మడి జిల్లాలో పదేళ్లుగా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. పశువుల గణన సరైన ప్రణాళిక, పశుసంక్షేమ ప్రణాళిక రూపకల్పనకు ఎంతో దోహదపడుతుంది, ఈ రంగంలో వినూత్న కార్య క్రమాలను అమలుచేయడానికి పశుగణన సమాచారం ఎంతో దోహదపడుతుంది.

తగ్గుతున్న కుందేళ్లు

2018 గణన ప్రకారం ఉమ్మడి జిల్లాలో కుందేళ్లు పదివేలకు మించి లేవు. కుందేళ్లను వేటాడడం, వాటి పెంపకాన్ని పెద్దగా చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల వాటి సంఖ్య ఐదేళ్లలో గణనీయంగా తగ్గిపోయి ఉండవచ్చునని పశు సంవర్ధక శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. పందుల సంఖ్య కూడా చాలా వరకు తగ్గిపోయింది. వ్యాధులకు కారణమవుతున్న పందుల పెంపకాన్ని ప్రభుత్వం ఏ మాత్రం ప్రోత్సహించడం లేదు. సీమ పందుల పెంపకం మాత్రం కొంత మేరకు కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గాడిదల సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపో యింది. ఇప్పుడు ఎక్కడా గాడిదలు కనిపించడం లేదు. గతంలో రజకులు గాడిదలను పెంచి పోషించేవారు. బట్టలను ఉతికేందుకు చాకిరేవుల వరకు బట్టల మూటలను తీసుకువెళ్లేందుకు వాటిని ఉపయోగించేవారు. ఇప్పుడు చాకి రేవులు తగ్గిపోయాయి. దానితో గాడిదల పోషణ కూడా తగ్గింది.

ఎన్యుమరేటర్లకు శిక్షణ

ఉమ్మడి జిల్లాలో పశుగణన నిర్వమించేందుకు 180మంది పశు వైద్యులను పర్యవేక్షకులుగా, 101 మంది పశు సంవర్ధక శాఖకు చెందిన వారిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారి ఉంటారు. ప్రతీ 1500 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను కేటాయిస్తారు. పశు జాతులను ఎలా గుర్తించాలి, యాప్‌ను ఎలా వినియోగించాలి, సేకరించిన సమాచారాన్ని ఎలా అప్‌లోడ్ చేయాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. గణన చేపట్టేవారు మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించి న వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో మ్యానువల్ పద్ధతిలో గణన జరగగా దేశంలో మొదటిసారిగా డిజిటల్ పశుగణనను చేపడుతున్నారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఆవులు, గేదెలు, కోళ్లు, మేకలు, గొర్రెలు, కుక్కలు, ఇతర పశవుల వివరాలను రైతులు, పశు పోషకులను అడిగి నమోదు చేసుకుంటారు. రైతుల వద్ద వ్యవసాయ పరికరాలు ఎన్ని, ఏవేవి ఉన్నాయనేది కూడా నమోదు చేస్తారు. ఈ సారి ప్రత్యేక యాప్‌ద్వారా పశుగణన నిర్వహిస్తున్న క్రమంలో ప్రతీ పశువుకు ఒక డిజిటల్ నెంబర్‌ను ఇచ్చి అందులో యజమానితో పాటు పశువు వివరాలను పొందుపరుస్తారు. పశువులను అమ్మినా, కొనుగోలు చేసినా వెంటనే వివరాలు తెలిసే విధంగా సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అడవుల్లో జీవించే వన్యప్రాణుల గణనను అటవీ శాఖ అధికారులు పూర్తి చేశారు.

ఉమ్మడి జిల్లాలో పశు సంపద

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2018లో నిర్వహిం చిన జాతీయ పశుగణన ప్రకారం పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు కుక్కలు కలుపుకొని మొత్తం 47.04 లక్షల లైవ్‌స్టాక్ ఉం ది. కోళ్లు 61.30 లక్షలు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో మొత్తం లైవ్‌స్టాక్ 10.56 లక్షలు ఉంది. ఇందులో 81వేలు పశువులు, 1.11 లక్షలు గేదెలు, 6.12 లక్షలు గొర్రెలు, 97వేలు గొర్రెలు, 8వేల పందులు, ఉన్నాయి. కాగా 3వేల కుక్కలు, 19.17 లక్షల కోళ్లు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 5.56 లక్షల పశు సంపద ఉంది. ఇందు లో 49వేల పశువులు, 76వేల గేదెలు, 5.08 లక్షల గొర్రెలు, 62వేల, మేకలు, 9వేల పందులు, ఉన్నాయి. కాగా 7వేల పందులు, 21.68 లక్షల కోళ్ళు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో మొత్తం పశు సంపద 5.06 లక్షలు. ఇందు లో 69వేల పశువులు, 63వేల గేదెలు, 2.92 లక్షల గొర్రెలు, 81వేల మేకలు, వెయ్యి పందులు ఉన్నాయి. కాగా కుక్కలు 2వేలు, కోళ్ళు 4.22 లక్షలు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 11.75 లక్షల పశు సంపద ఉంది. ఇం దులో 1.82 లక్షల పశువులు, 1.30 లక్షల గేదెలు, 6.78 లక్షల గొర్రెలు, 1.78 లక్షల మేకలు, 8 వేల పందులుఉండగా, కుక్కలు 11వేలు, కోళ్లు 11.09 లక్షలు ఉన్నాయి. ఉన్నాయి. ములుగు జిల్లాలో మొత్తం 3.65 లక్షల పశు సంపద ఉంది. వీటిలో 99వేల పశువులు, 61వేలే గేదెలు, 1.29 లక్షల గొర్రెలు, 75వేల మేకలు ఉండగా 4వేల కుక్కలు, 5.14 లక్షల కోళ్లు ఉన్నాయి. జనగామ జిల్లాలో మొత్తం 10.46 లక్షల లైవ్‌స్టాక్ ఉంది. ఇందులో 1.02 లక్షల పశువులు, 1.20 లక్షల గేదెలు, 8.01 లక్షల గొర్రెలు, 1.83 లక్షల మేకలు, 3వేల పందులు ఉండగా కుక్కలు 2వేలు, కోళ్లు 7.25 లక్షల కోళ్లు ఉన్నాయి.

ఆకేరు బ్రిడ్జి వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయొద్దు : సీఐ



మరిపెడ, సెప్టెంబరు 15 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పీఎస్ గూడెం ఆకేరు బ్రిడ్జి దగ్గర ప్రమాదం పొంచి ఉన్నందున అక్కడ వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయొద్దని మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ వినాయక మండపాల నిర్వాహకులను కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మరిపెడ, సీరోల్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలాల్లోని ఆకేరు పరివాహక గ్రామస్థులు వినాయ విగ్రహాలను ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులలో నిమజ్జనం చేసుకోవాలన్నారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంతో పాటు పరిధిలోని వినాయక విగ్రహాలను మరిపెడ మాకుల పెద్దచెరువులో నిమజ్జనం చేసుకోవాలని కోరారు. పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూర కుమారి

● మరిపెడ : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని మాకుల పెద్దచెరువు దగ్గర నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి పరిశీలించారు. మునిసిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిమజ్జన ప్రదేశంలోని చెరువు కట్టపైమునిసిపల్ అధికారులు ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి, మరిపెడ అదనపు ఎస్సై సంతోశ్, సిబ్బంది ఉన్నారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎస్సై మురళీధర్‌రాజ్



ఇనుగుర్తి, సెప్టెంబరు 15 : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతతమైనవాతావరణంలో పురుపుకోవాలని ఎస్సై మురళీధర్‌రాజ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గణేష్ శోభయాత్రలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ కమిటీ నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. ఊరేగింపు జరిగేటప్పుడు విద్యుత్ తీగలు, ఎదురుగావచ్చే వాహనాలను గమనించాలని సూచించారు. బాణాసంచా, డీజేసౌండ్ సిస్టంను పూర్తిగా నిషేధించినట్లు వివరిం చారు. నిమజ్జన సమయంలో చెరువుల వద్దకు చిన్నపిల్లలను తీసుకువెళ్లకూడదని, వీలైనంత త్వరగా నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని సూచించారు.



బ్రహ్మణపల్లిలో హోమపూజలో పాల్గొన్న బుడిగె సతీష్-మానస దంపతులు



కురవిలో అక్షర ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్న సభ్యులు



సెవెన్ హిల్స్‌లో వినాయక విగ్రహం వద్ద అన్నప్రసాద వితరణ చేపడుతున్న ఉత్సవ కమిటీ బాధ్యులు



బయ్యారం మండలం జగ్గుతండా వినాయక మండపం వద్ద అన్నదానం

కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు15 : జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, మండలకేంద్రాలు, గ్రామాలు, తండాల్లోని వీధివీధినా ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు చేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద హోమం చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అన్నదాన దాత కోట నిర్మలరెడ్డి సంజీవరెడ్డి దంపతులు, సొసైటీ బాధ్యులు కోట సంజీవరెడ్డి, బండారు వెంకటరమణ, ఉప్పల శ్రీనివాస్, తల్లాడ శ్రీనివాస్, వేముల రవికుమార్, బ్రాహ్మణపల్లి శ్రీనివాస్, సీతారాములు, వేణుమాధవ్, కిషన్, శ్రీరాంప్రసాద్, తిరుపతిరెడ్డి, బండారు శ్రీలత, రచ్చ సుజాత, తోట శిరీష్, ఉప్పల పద్మ, శ్రీరాంప్రియాంక, కోడి ఉష, తల్లాడ విజయలక్ష్మీ, కొదుమూరి పద్మ, సుధా, శ్రీలక్ష్మీ, స్వాతి, శ్రీదేవి, సువర్ణ పాల్గొన్నారు. రాహులనగర్‌లో రాహుల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కాట భాస్కర్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్ బాధ్యులు పాల్గొన్నారు. ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన వినాయకకుడి వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

బ్రహ్మణపల్లిలో..

● గూడూరు : బ్రహ్మణపల్లిలో బుడిగే సతీష్-మానస దంపతులు మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూర్ణహుతి, హోమం, వేదపండితులు రాజశాస్త్రీ మంత్రోచ్ఛరణల నడుమ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సుమారు 500 మందికి మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగింది. గ్రామపెద్దలు బత్తుల రామన్న, మాజీ సర్పంచ్ పూనెం యాకయ్య, డొనికెల రమేష్, భూపతి శ్రీను, కారింగుల శ్రీనివాస్, దారావత్‌పీర్యా, పబ్బోజు యాకాచారి, బొల్లిసారయ్య, డొనికెల కుమారస్వామి, ఈసం గణేష్, పూనెం సాయి, ముల్కపూరి సురేష్, బుర్ర అజయ్, వినయ్, రోహిత్, రాము, వెంకటేష్, సాగర్ పాల్గొన్నారు.



కేసముద్రం ఆదిదేవ మండపం వద్ద తల్లిదండ్రులకు పాదపూజ చేయిస్తున్న అర్చకులు

● కురవి : కురవిలోని 747 కాలనీలో అక్షర ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గంగరబోయిన కృష్ణ, నల్లు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దేవరశెట్టి వెంకన్నలు ప్రారంభించారు.యూత్‌సభ్యులు నవీన్, కల్యాణ్, అఖిల్, సంపత్, వివేక్, సాయి పాల్గొన్నారు.

● బయ్యారం : మండలంలో పలుచోట్ల గణేష్ మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. బయ్యారం రుద్రమదేవి వీధిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ రవికుమార్, ఎస్ఐ తిరుపతి, జగ్గుతండాలో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి ప్రారంభించారు. మండల వ్యాప్తంగా గణేష్ మండపాల వద్ద అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

కేసముద్రం, సెప్టెంబర్ 15 : మానవ సంబంధాలు పట్టించుకోకుండా తల్లిదండ్రులను ఆదరించని వారికి సందేశం ఇస్తున్నట్లుగా తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలుగా బావిస్తూ వారికి పాదపూజ చేసిన అపురూప కార్యక్రమం కేసముద్రం రైల్వేస్టేషన్ ఆవరణలోని ఆదిదేవా వెల్ఫేర్ గణేష్ మండపంవద్ద ఆదివారం నిర్వహించారు. తల్లిదండ్రుల ప్రాముఖ్యతను వివరిస్తూ అర్చకుని మంత్రోచ్చారణల నడుమ నాలుగు జంటలకు తమ సంతానం పూలతో పాదాలకు పూజలు నిర్వహించారు. అంతకు ముందు శ్రీపుష్పయాగ ప్రయుక్త శ్రీనివాస వైభోగం కార్యక్రమంలో భాగంగా పుష్పాలతో ఆరడుగుల వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని రూపొందించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 15 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ఏటిగడ్డతండా సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఏటిగడ్డ తండాకు చెందిన బానోత్ సాయిరాం, గుగులోతు నితిన్ మహబూబాబాద్ నుంచి నడుచుకుంటూ ఏటిగడ్డతండాకు వెళ్తుండగా నర్సంపేట నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న కారు అతివేగంగా వారిని ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిరాంకు చేయి విరగగా, నితిన్‌కు కాలు విరిగింది. వెంటనే స్థానికులు 108 ద్వార మహబూబాబాద్ జిల్లా అస్పత్రికి తరలించారు. అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.



కాడెడ్లుగా మారి పంట పొలాల నుంచి ఎడ్లబండిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒడ్డుకు తీసుకెళ్తున్న రైతులు

ఎడ్ల బండికి రైతులే కాడెడ్లు

మరిపెడ, సెప్టెంబరు 15 : ఎడ్ల బండికి రైతులే కాడెడ్లుగా మారి.. పొలాలలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒడ్డుకు చేర్చిన ఘటన ఆదివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాంపురం గ్రామానికి చెందిన ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాడైంది. గత పక్షం రోజులుగా కరెంట్ సరఫరా లేక రైతుల పంటపొలాలు వాడిపోతున్నాయి. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు ఎడ్లబండిని తీసుకెళ్లి రైతులే కాడెడ్లుగా మారి, ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒడ్డుకు చేర్చారు. తీరా విద్యుత్‌సబ్‌స్టేషన్‌కు వెళ్లి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం విద్యుత్ అధికారులను వాకబ్ చేయగా, ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేవని అధికారులు తెల్పడంతో రైతులు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని అక్కడి యువత వీడియోతో సహా సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

'టీటీడీ బలోపేతానికి కృషి చేయాలి'

పెద్దవంగర, సెప్టెంబర్ 15 : తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం బూత్‌స్థాయి నుంచి పటిష్టంచేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గట్టు ప్రసాద్‌బాబు పిలుపు నిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు భైన భిక్షపతి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. దివంగత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి ఉమ్మడి రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను పునికి పుచ్చుకొని విజన్ ఉన్నత నేతగా ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని తెలిపారు. ప్రజల వద్దకే పాలన తెచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందని తెలిపారు. త్వరలో అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు పిట్టల శ్రీనివాస్, తొర్రూరు మండల అధ్యక్షుడు బోగ భాస్కర్, కుమారస్వామి, సోమ వీరన్న, శ్రీను, అనిల్, సోమయ్య, నరేష్, శ్రీకాంత్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో నిత్యావస్తువులు పంపిణీ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లికుదురు, సెప్టెంబరు15 : రావిరాల వరద బాధితులకు టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావస వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు కొండపెల్లి రామచందర్‌రావు మాట్లాడుతూ వరదలకు రావిరాలలో పొలాలు కొట్టుకపోయి, ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులైనారని ఆవేదన వ్యక్తం చేశాడు. పొలాలు కొట్టుకపోయిన రైతులకు ఎకరానికి 30 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుతారపు సత్యనారాయణ, భూక్య సునితామంగిలాల్, బానోత్ హరికిషన్, కడారి ఐలయ్య, భూక్య సోమన్న, పాల్గొన్నారు.

రావిరాలలో..

● నెల్లికుదురు : రావిరాలలో వరద బాధితులకు నిర్మాన్ ఆర్గనైజేషన్, ఓపెన్‌టెక్స్ కార్పొరేట్ సంస్థ ఆధ్వర్యంలో 170 మంది వరద బాధితులకు 17 రకాల నిత్యవస వస్తువులు అందజేశారు. నిర్మాన్ ఆర్గనైజేషన్ మేనేజర్ ఉషాకర్, మహేష్‌సాయి, వివేక్ అనిల్, వంశీ ,రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

నర్సింహులపేట, సెప్టెంబరు 15 : మండలంలోని పెద్దనాగారంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన 17 కుటుంబాలకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు సయ్యద్ రఫీ-నితీష దంపతులు ఆదివారం పదిరకాల నిత్యావసర సరుకులుపంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలకు రైతులు, పేదప్రజలు తీవ్రంగా నష్టపోయిన దృష్ట్యా స్థితిగతులను చూస్తే బాదేసిందన్నారు. అధికంగా నష్టపోయిన 17కుంటుంబాలను గుర్తించి సుమారు రూ.10 వేలు విలువ గల పదిరకాల నిత్యావసర సరులు అందించినట్లు తెలిపారు. దీంతో రఫీ దంపతులను గ్రామస్థులు, కాంగ్రెస్ మండల కమిటీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనారిటీ సెల్ నాయకులు ఉన్నారు.

విద్యుత్ మోటారును తీయడానికి వెళ్లి..

నీటిలో మునిగి కూలి మృతి

మరిపెడ, సెప్టెంబరు 15 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బావిలో నీట మునిగిన విద్యుత్ మోటారును తీయడానికి వెళ్లి ఓ కూలి మృతి చెందిన సంఘటన ఆదివారం మరిపెడ మునిసిపల్ పరిధి మాకులతండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఆ తండాకు చెందిన గుగులోత్ బాలు మరో రైతు భూమిని కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ మోటారు బావి నీటిలో మునిగింది. ఆ మోటరును బయటికి తీయడానికి అదే తండాకు చెందిన బాధవత్ శ్రీను(37)ని కూలికి తీసుకెళ్లారు. శ్రీనుకు ఈత వచ్చినప్పటికీ ఏమైందో ఏమో కానీ నీటిలోనే మునిగి మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడంతో వేరే మోటార్లు పెట్టి శ్రీను డెడ్ బాడీని పైకి తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

నెహ్రూనాయక్ జన్మదిన వేడుకలు

డోర్నకల్, సెప్టెంబరు 15 : తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడు మాలోతునెహ్రూనాయక్ జన్మదిన వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. డోర్నకల్ గాంధీ సెంటర్‌లో మాలోతు నెహ్రూనాయక్ జన్మదిన కేక్‌ను పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుమీర్ చంద్‌జైన్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తారాచంద్, ప్రవీన్ నాయక్, సతీష్, స్వామి, కిట్టు, రాహుల్, శీలం శ్రీనివాస్, రవీందర్, ఎర్ర శ్రీనివాస్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అపూర్వ సమ్మేళనం



చిట్యాలలో వేదికపై పూర్వ విద్యార్థులు

పెద్దవంగర, సెప్టెంబర్ 15 : మండలంలోని చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007-2008 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 16 ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆత్మీయంగా కలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. వేదికపై ఒక్కొక్కరు నాటి తరగతి గదిలో చేసిన చేష్టలను, మాస్టారు మందలింపులను గుర్తుచేసుకున్నారు. ఇక్కడచదువుకొని ఎక్కెడక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, బ్రహ్మానందరెడ్డి, పరిపూర్ణచారి, కుమారస్వామి, ఉపేంద్ర, రమేష్‌లతో పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎం విజయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు అవుల మహేష్, అశోక్, నాగరాజు, మహేందర్, ప్రశాంత్, జైపాల్, శంకర్, బాలరాజు, ఉపేందర్, సంపత్, శోభన్‌బాబు, సంధ్య, స్వప్న, అనిత, కల్పన, నీరజ, రాణి పాల్గొన్నారు.

'శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేయడం సరికాదు'

పెద్దవంగర, సెప్టెంబర్ 15 : మండలంలోని చిట్యాలలో పూసలి కులస్తులకు సంబంధించిన శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేయడం సరికాదని పూసలి కులస్తులు తన్నీరు గురువయ్య, మున్నూరు రామ్‌నారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని చిట్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చిట్యాలలో పదిపైగా పూసలి కుటుంబాలు నివసిస్తున్నామని, ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాల కోసం గ్రామ శివారులోని చెరువు శిఖంలో 70 ఏళ్ల కిందట శ్మశాన వాటికను ఏర్పాటు చేసుకొని అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. పూర్వకాలం నుంచి వస్తున్న శ్మశాన వాటికను గ్రామానికి చెందిన రావుల తిరుమల్ రెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధింత అధికారులు శ్మశానవాటిక స్థలాన్ని కాపాడి కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికులను బాధ్యులుగా చేర్చవద్దు

● ప్రజాసంఘాలు

తొర్రూరు, సెప్టెంబరు 15 : మండలంలోని కంటాయపాలెంకు చెందిన రమేష్ అను వ్యక్తి మృతికి పరోక్షంగా కారణం అంటూ మునిసిపల్ కార్మికులను ముద్దాయిలుగా చేసి, వారిపై కేసులు నమోదు చేయాలని చూస్తే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు టి.విశ్వేశ్వర రావు, ఐఎఫ్‌టీయూ తెలంగాణ ప్రగతి శీల సంఘం మునిసిపల్ ఏరియా కార్యదర్శి ఎండీ.షరీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపల్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని, మునిసిపల్ అధికారులు, పాలకవర్గం 8 నెలలుగా డంపింగ్ యార్డు సమస్య ఉన్నా పట్టించుకోకుండా, డంపింగ్ యార్డు చేయలేని స్థితిలో ఉండి మునిసిపల్ కార్మికులను బాధ్యులు చేయడం సరికాదన్నారు. బాధిత కుటుంబానికి మునిసిపల్ పాలకవర్గం, కమిషనర్ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై కేసులు నమోదు చేస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేయాలని, పట్టణ శివారుల్లో చెత్త వేయకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, కార్మికులపై వేధింపులు నిలిపివేయాలన్నారు. పాలకవర్గమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

కమ్యూనిస్టుల పోరాటంతోనే విముక్తి

● సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి

కురవి, సెప్టెంబరు 15 : కమ్యూనిస్టుల వీరోచిత సాయుధ పోరాటంతోనే తెలంగాణ వెట్టి చాకిరీ, బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కురవిలో అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ పతకాన్ని ఆవిష్కరించారు. దొపిడీ దొరల ఆగడాలు, రజకార్ల అరాచకాలు, నిజాం నిరంకుశ పాలనపై కమ్యూనిస్టుల నాయకత్వంలో మహోన్నత పోరాటం సాగించి మూడు వేల మంది ప్రాణాలను బలిపెట్టి పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేశారని, వేలాది గ్రామాలను విముక్తి చేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, పెద్ది శ్రీను, బాబు, నాగేశ్వర్‌రావు, వెంకన్న, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

ఇంజనీరింగ్ వృత్తికే గౌరం తెచ్చిన మహోన్నతులు విశ్వేశ్వరయ్య



ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 : సాగునీట ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి ఇంజనీరింగ్ వృత్తికే గౌరం తెచ్చిన మహోన్నత వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని మహబూబాబాద్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి, రీజనల్ చైర్మన్ రామసహాయం వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం వ్యవసాయాధారిత రంగంపై ఆధారపడి ఉండటంతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టిన తొలి ఇంజనీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిలిచారని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేసిశాలువాతో ఘనంగా సత్కరించారు. అశోక్‌రెడ్డి, ప్రసాద్, భవిరిశెట్టి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డిని పరామర్శించిన అరూరి



బీజేపీ రాష్ట్ర నేత లింగాల సుధీర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి

గూడూరు, సెప్టెంబరు 15 : మదనాపురం గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు లింగాల సుధీర్‌రెడ్డికి ఇటీవల కాలుకు శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయం తెలుసుకున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదివారం మదనాపురంకు చేరుకుని, సుధీర్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు బీరవెల్లి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తులసీరాంనాయక్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నెల్లికుదురు, సెప్టెంబరు 15 : గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య తెలిపారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆదివారం జీపీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా జీపీ కార్మికులు సేవలందిస్తున్నారని ప్రభుత్వాలు మారిన జీపీ కార్మికుల బతుకులు మారలేదన్నారు. మల్టీపర్పస్ విధానాన్నిరద్దు చేయాలన్నారు. కనీస వేతనం 20 వేలకు పెంచాలన్నారు. జిల్లా కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి, బొల్లం ఎల్లయ్య మారబోయిన శ్రీను, ఇసంపెల్లి సైదులు, మయ్య రాము, మంజంపెల్లి యాకయ్య, రామకోటి, మహ్మద్ సుభాన్, జల్లె వెంకటమ్మ ఆరెపెల్లి రాధమ్మ, భూక్య బిక్కు, హెచ్.వెంకన్న పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

కేసముద్రం, సెప్టెంబర్ 15 : తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి సత్కరించాలని మలిదశ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. కేసముద్రంలో ఆదివారం ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులైన సీపీఎం నాయకుడు చాగంటి కిషన్, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మాజీ సర్పంచ్ భట్టు శ్రీను మాట్లాడారు. సోమారపు వెంకటయ్య, వేం నర్సింహారెడ్డి, బాల్ మోహన్, షేక్ ఖాదర్, జనిగెల పరమేశ్వర్, దండు శ్రీను, చిట్యాల వీరన్న, పింగిళి శ్రీనివాస్, కొలిపాక వెంకన్న పాల్గొన్నారు.